సాక్షి అనకాపల్లి

శనివారం । 22 । ఫిబ్రవరి । 2025



అంకుడు మొక్కల పెంపకం 8లో

ఏటికొప్పాక బొమ్మల తయారీని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అంకుడు మొక్కల పెంపకం చేపడుతోందని డ్వామా పీడీ చెప్పారు.



ఉత్సాహంగా క్రీడా పోటీలు

నెహ్రూయువ కేంద్రం ఆధ్వర్యంలో నర్సీపట్నంలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. 8లో

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గరిష్ట ఉష్ణోగ్రతలు ఈనెల 22న 35 డిగ్రీలు, 23న 34.9, 24న 35.6, 25న 35.1, 26న 35.4 డిగ్రీలు నమోదయ్యే అవకాశముందని తెలిపారు.

600 కేజీల గంజాయి స్వాధీనం

విలువ సుమారు రూ.30 లక్షలు



గంజాయిని పరిశీలిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

పాయకరావుపేట: గోపాలపట్నం గ్రామం సూదికొండ శివారులో 600 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. సరకు విలువ సుమారు రూ.30 లక్షలు ఉంటుందని చెప్పారు. పాయకరావుపేట పోలీసు స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సూదికొండ సమీపాన గంజాయి నిల్వ ఉందన్న సమాచారం మేరకు స్థానిక ఎస్ఐ, పోలీసు సిబ్బంది ప్రదేశానికి చేరుకొని, 19 గోనె సంచుల్లో ఉన్న 600 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి, ఒక కారు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మండలంలో గల గుంటపల్లి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఏజెన్సీ నుంచి గంజాయిని తెప్పించి ఇతర రాష్ట్రాలకు అమ్ముతాడని, ఈ క్రమంలోనే ఒడిశా ప్రాంతంలో ఒక గ్రామం నుండి జీకే వీధి మండలం మొండిగడ్డకు చెందిన వ్యక్తితో ఐదు లక్షలకు బేరం కుదుర్చుకున్నాడని చెప్పారు. సుమారు 600 కేజీల గంజాయిని మరో ఇద్దరు వ్యక్తుల సహాయంతో సేకరించి.. వ్యాన్‌లో ఇద్దరు డ్రైవింగ్ చేసుకుంటూ, మరో ఇద్దరు పల్సర్ బైక్‌పై వారి ముందు పైలెట్ చేసుకుంటూ సీలేరు నుంచి పాయకరావుపేట తీసుకువచ్చారు. ప్రధాన నిందితుడు గతంలో తనకు జైలులో పరిచయమైన ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులతో బేరం కుదుర్చుకుని అమ్ముతుంటాడని, ఈ క్రమంలోనే చెన్నైకి చెందిన బాస్ అనే వ్యక్తికి సుమారు 145 కేజీల గంజాయి సరఫరా చేయడం కోసం గుంటపల్లికి చెందిన వ్యక్తి అడ్వాన్స్ తీసుకుని పంపించడానికి సన్నాహాలు చేస్తుండగా పోలీసులు పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన ఐదుగురు వ్యక్తుల సమాచారం మేరకు, మరో ముగ్గురు వ్యక్తులను పిఎల్ పురం వద్ద అదుపులోనికి తీసుకున్నట్లు తెలిపారు. గంజాయిని, నిందితులను చాకచక్యంగా పట్టుకున్న పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు. సీఐ జి.అప్పన్న, ఎస్ఐ పురుషోత్తం, హెచ్‌సీ శ్రీనివాసరావు, పీసీ సతీష్, సూరిబాబులకు, హోంగార్డ్ మదీనాకు ఎస్పీ తుహిన్ సిన్హా ప్రశంసా పత్రాలను అందించారు.

25న షాలిమార్-విశాఖ ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం (విశాఖ): నిర్వహణ పనుల కారణంగా ఆయా మార్గాల్లో పలు రైళ్లను రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ నెల 25న సంత్రగచ్చి-చెన్నై సెంట్రల్(22807) ఎక్స్‌ప్రెస్, షాలిమర్-విశాఖపట్నం (22853) ఎక్స్‌ప్రెస్, 26న విశాఖపట్నం-షాలిమర్(22854) ఎక్స్‌ప్రెస్, 27న చెన్నై సెంట్రల్-సంత్రగచ్చి (22808) ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ మార్పులు గమనించాలని సూచించారు.

ప్రభుత్వ భూమిని రాసిచ్చారు..

- సర్వే నెంబర్లు మార్చి రియల్టర్ పేరున 2.91 ఎకరాల అసైన్డ్ భూమికి మ్యుటేషన్
- రూ.10 కోట్ల విలువైన భూమిని సిమెంట్ కంపెనీ పేర రిజిస్ట్రేషన్ చేసిన రియల్టర్
- కొనుగోలు చేసిన ప్రభుత్వ భూమితో పాటు చెరువు, శ్మశానాల ఆక్రమణ
- పూర్వ తహసీల్దార్ అండతో యథేచ్ఛగా అక్రమాలు
- గతంలో సిట్‌కు, ప్రస్తుతం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం
- ఏడేళ్లుగా ప్రభుత్వ భూమిని కాపాడేందుకు సామాన్య రైతు పోరాటం
- వ్యవహారమంతా అప్పటి టీడీపీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలోనే

ముడుపులకు కక్కుర్తి పడి సర్వే నంబర్లు మార్చి కోట్లాది రూపాయల ప్రభుత్వ భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించి ఓ తహసీల్దార్ రియల్టర్ పేర మ్యుటేషన్ చేశారు.. ఆ భూమిని రియల్టర్ నుంచి కొనుగోలు చేసిన ఓ సిమెంట్ కంపెనీ యాజమాన్యం మరింత బరితెగించి పక్కనే ఉన్న చెరువు, శ్మశానం ఆక్రమించి అనుమతి లేకుండా 15 అడుగుల ప్రహరీని దర్జాగా నిర్మిస్తోంది. ఈ రెండు వ్యవహారాలు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనకు ముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో.. ఇప్పుడు కూటమి సర్కారు వచ్చిన తర్వాత జరగడం గమనార్హం. ఆనాడు, ఈనాడు ఒకే తహసీల్దార్ ఇందుకు సహకరించారు. ప్రభుత్వ భూమిని జిరాయితీగా మార్చిన విషయాన్ని 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందానికి (సిట్), ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు రేగుపాలెం గ్రామానికి చెందిన ఓ సామాన్య రైతు ఫిర్యాదు చేశారు. విచారణలో అక్రమాలు రుజువైనప్పటికీ రెవెన్యూ అధికారుల చర్యలు శూన్యం.




రేగుపాలెంలో ఆక్రమణకు గురైన ఎర్రచెరువు చుట్టూ నిర్మించిన ప్రహరీ

యలమంచిలి రూరల్: యలమంచిలి మండలం రేగుపాలెం గ్రామం సర్వే నెంబరు 167/1లో 4.20 ఎకరాలు, సర్వే నెంబరు 167/3లో 4.74 ఎకరాలు రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ అనాధీనం భూమిగా నమోదై ఉంది. 2004లో పోలవరం ఎడమ ప్రధాన కాల్వ నిర్మాణం కోసం సర్వే నెంబరు 167/1లో 1.95 ఎకరాలు, సర్వే నెంబరు 167/3లో 4.08 ఎకరాల భూమిని కేటాయించారు. సర్వే నెంబరు 167/1లో మిగిలిన 2.25 ఎకరాల భూమిని సర్వే నెంబరు 167/4గా, సర్వే నెంబరు 167/3లో 0.66 ఎకరాల మిగులు భూమిని సర్వే నెంబరు 167/5తో మార్చి 2014-2017 మధ్య అప్పటి యలమంచిలి తహసీల్దార్ అసైన్డ్ భూమిగా నమోదు చేశారు. ఆ ప్రాంతంలో రియల్టర్ శాఖమూరి శ్రీనివాసరావు సుమారు 20 ఎకరాల భూమి కొనుగోలు చేశాడు. ఆ పక్కనే ఉన్న ప్రభుత్వ అనాధీన భూములపై కూడా కన్నేసిన ఆ రియల్టర్ నుంచి భారీగా ముడుపులు ముట్టడంతో ప్రభుత్వ భూమిని అతని పేర రెవెన్యూ రికార్డుల్లో (1బీలో) డీ పట్టా భూమిగా తొలుత నమోదు చేశారు. ఇందుకోసం మాన్యువల్‌గా రాసిన రెండు నకిలీ పాసు పుస్తకాలు కూడా సృష్టించారు. 20 ఎకరాలు కొనుగోలు చేసిన ధనవంతుడైన భూస్వామి పేర డీ పట్టాగా నమోదు చేయడం నిబంధనలకు విరుద్ధం. 2017 జూన్ 7న ఈ వ్యవహారంపై రేగుపాలెం గ్రామానికి చెందిన రైతు రెడ్డి రమణ అప్పటి టీడీపీ ప్రభుత్వం నియమించిన సిట్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరుపుతున్న సమయంలో అప్పటి తహసీల్దారు సహకారంతో రియల్టర్ శాఖమూరి శ్రీనివాసరావు హైకోర్టులో పిటిషన్ వేసి సిట్ విచారణపై స్టే తెచ్చుకున్నారు. ఇప్పటికీ ఆ వ్యాజ్యం పెండింగ్‌లో ఉంది. ఆ తర్వాత మళ్లీ ఆనాటి తహసీల్దారే బదిలీపై వచ్చారు. రేగుపాలెం సర్వే నెంబరు 167/4, 167/5లో ఉన్న 2.91 ఎకరాల అనాధీనం భూమికి రీసర్వే చేయించి ఎల్‌పీఎం నెంబర్లు 5240, 5242 కేటాయించి జిరాయితీ భూమిగా రియల్టర్ శాఖమూరి శ్రీనివాసరావు పేరున మ్యుటేషన్ చేశారు. గతేడాది జూలై 31న ఆ భూమిని శాఖమూరి శ్రీనివాసరావు ఓ



2017లో 1బీలో డీపట్టా భూమిగా నమోదైన సర్వే నెంబర్లు 167/4, 167/5లో భూమి



→ 2024లో అదే సర్వే నెంబర్లలో భూమి జిరాయితీగా మార్చిన అధికారులు

సిమెంట్ పరిశ్రమ యాజమాన్యానికి యలమంచిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దస్తావేజు నెంబరు 9034/2024తో క్రయం చేశాడు. ఈ వ్యవహారంలో అప్పటి రెవెన్యూ అధికారులకు భారీగా సొమ్ము ముట్టడం వల్లనే రియల్టర్‌కు అనుకూలంగా రికార్డులు తారుమారు చేసినట్లు ఆరోపణలున్నాయి. దీనికి బాధ్యులైన తహసీల్దార్, ఇతర సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని రైతు రెడ్డి రమణ అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు నాలుగు నెలల క్రితం ఫిర్యాదు చేశారు. విచారణలో అక్రమాలు వాస్తవమేనని తేలినా ఉన్నతాధికారులు ఇప్పటివరకు సంబంధిత అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.



రేగుపాలెం సర్వే నెంబరు 167/5లో గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా నిర్మాణ పనులు

అక్రమాలు నిర్ధారిస్తూ నివేదిక

రైతు రెడ్డి రమణ జిల్లా కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపిన ప్రస్తుత తహసీల్దార్ కె.వరహాలు అక్రమాలను నిర్ధారిస్తూ ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. రేగుపాలెం గ్రామంలో ప్రభుత్వ అసైన్డ్ భూములను జిరాయితీగా రికార్డులు మార్చి రిజిస్ట్రేషన్‌కు సహకరించడం, చెరువు, శ్మశాన వాటిక ఆక్రమణ, నిబంధనలకు విరుద్ధంగా ప్రహరీ గోడ నిర్మాణం వంటివి విచారణలో నిరూపితమయ్యాయి. సుమారు మూడు నెలలు గడుస్తున్నా నేటికీ దీనిపై చర్యలు తీసుకోకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటో జిల్లా ఉన్నతాధికారులే చెప్పాల్సి ఉంది. చర్యలు తీసుకోకపోగా ఫిర్యాదుదారునితో అధికార యంత్రాంగం అమర్యాదగా ప్రవర్తిస్తూ తమ చుట్టూ తిప్పించుకుంటున్నారు.

చెరువు, శ్మశానం ఆక్రమణ.. అనుమతి లేకుండా ప్రహరీ నిర్మాణం

ఇక్కడ భూమిని కొనుగోలు చేసిన సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం మరింత బరితెగింపునకు దిగింది. కొనుగోలు చేసిన భూములతోపాటు పక్కనే సర్వే నెంబరు 165లో 4.68 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఎర్ర చెరువు, సర్వే నెంబరు 164లో ఉన్న శ్మశాన వాటికను ఆక్రమించుకోవడానికి స్కెచ్ వేసింది. చెరువు గట్టును చదును చేసి శ్మశాన వాటిక స్థలాన్ని కొంతమేర ఆక్రమించి సుమారు 15 అడుగుల ఎత్తులో భారీ ప్రహరీ గోడ నిర్మాణం చేస్తోంది. ప్రహరీ గోడ నిర్మాణం పూర్తయితే ఎర్రచెరువు ఆయకట్టు భూములకు సాగునీరందడం ప్రశ్నార్థకమేనని స్థానిక రైతులు ఆవేదన చెందుతున్నారు. ఏపీ ల్యాండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ యాక్ట్ 1905 ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉన్నా, తమ కళ్లముందే ఆక్రమణలు కనిపిస్తున్నా స్థానిక రెవెన్యూ అధికారులు మాత్రం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. మరోవైపు సిమెంటు పరిశ్రమ యాజమాన్యం చేపడుతున్న భారీ ప్రహరీ గోడ నిర్మాణ పనులకు గ్రామ పంచాయతీ నుంచి అనుమతులు కూడా తీసుకోలేదు. అయినా పంచాయతీ అధికారులెవరూ నోరు మెదపడం లేదు.

'కూటమి' అధికారంలోకి వచ్చాకే రిజిస్ట్రేషన్



ఏడేళ్లుగా ప్రభుత్వ భూమి కోసం పోరాడుతున్నాను. 2017లో సిట్‌కు, 2024 అక్టోబర్‌లో జిల్లా కలెక్టర్‌కూ ఇక్కడ జరిగిన అక్రమాలపై ఫిర్యాదు చేశాను. గతేడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే అప్పటి తహసీల్దార్ ప్రభుత్వ భూమిని జిరాయితీగా మార్పు చేశారు. అప్పటివరకూ హైకోర్టులో వ్యాజ్యం పెండింగ్‌లో ఉందని చెబుతూ కాలయాపన చేసి 2024 జూలై 31న 2.91 ఎకరాల భూమికి రిజిస్ట్రేషన్ జరిగేలా తహసీల్దార్ సహకరించారు. ఎర్రచెరువు, శ్మశాన వాటిక కూడా ఆక్రమించి ప్రహరీ గోడ కడుతున్నా అధికారులెవరూ పట్టించుకోవడంలేదు. కూటమి ప్రభుత్వం ఇలాంటి అక్రమాలకు సహకరిస్తోంది. ప్రభుత్వ భూమిని అధికారులు స్వాధీనపర్చుకోవాలి.

– రెడ్డి రమణ, రైతు రేగుపాలెం

సిమెంటు కంపెనీకి నోటీసులిచ్చాం



రేగుపాలెం సర్వే నెంబర్లు 164,1 65లో చెరువు, శ్మశాన వాటికను ఆక్రమించుకుని ప్రహరీ గోడ నిర్మిస్తున్న సిమెంట్ పరిశ్రమ యాజమాన్యానికి నోటీసులిచ్చాం. ఆక్రమిత స్థలంలో నిర్మించిన ప్రహరీ గోడ తొలగించాలని చెప్పాం. సర్వే నెంబర్లు 167/4, 167/5లో ఉన్న భూమి పొరపాటుగా జిరాయితీగా నమోదు కావడం వలన రిజిస్ట్రేషన్ జరిగింది. దీనిపై రేగుపాలేనికి చెందిన రెడ్డి రమణ జిల్లా కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదుపై పరిశీలన జరిపి నివేదికను ఉన్నతాధికారులకు పంపించడం జరిగింది.

– కె.వరహాలు, తహసీల్దార్, యలమంచిలి

పరిశ్రమలకు విద్యుదాఘాతం

- కూటమి ప్రభుత్వంలో 4 భారీ, 30కి పైగా చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు దెబ్బ
- విద్యుత్ భారంతో మూసుకుపోతున్న ఫెర్రో పరిశ్రమలు
- ఉపాధి కోల్పోతున్న వేలాదిమంది కార్మికులు

కూటమి ప్రభుత్వ వైఖరితో జిల్లాలో పరిశ్రమలు మూతపడుతున్నాయి. పెరిగిన విద్యుత్ భారం, తగ్గిన రాయితీలు, ఇతర కారణాలతో పొరుగు రాష్ట్రాలకు పోయేందుకు సిద్ధమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి నేటి వరకూ జిల్లాలో 4 భారీ పరిశ్రమలు, 30కు పైగా చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఉత్పత్తి నిలిపివేశాయి. వీటిలో పరవాడ-అచ్యుతాపురం సెజ్‌లో 2 ఫెర్రో పరిశ్రమలు, కశింకోట మండలం తేగాడలో క్రెబ్స్ బయో కెమికల్ పరిశ్రమ ఉన్నాయి. ఫెర్రో పరిశ్రమలు మూతపడడానికి విద్యుత్ భారమే కారణం. ఇంకా మరికొన్ని పరిశ్రమలు మూతపడే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు.

సాక్షి, అనకాపల్లి:

విద్యుత్ చార్జీల పాపం ఫెర్రో ఎల్లాయ్స్ పరిశ్రమల పాలిట శాపంగా మారింది. అచ్యుతాపురం-పరవాడ సెజ్‌లో మొన్న అభిజిత్ ఫెర్రో ఎల్లాయ్స్ పరిశ్రమ మూతపడింది. ఇప్పుడు మరో ఫెర్రో పరిశ్రమ 'రాజరాజేశ్వరి లలిత త్రిపురసుందరి' మూసేందుకు సిద్ధంగా ఉంది. గతంలో మూతబడి ప్రొడక్షన్ లేకుండా సదరన్ బయో డీజిల్, డబ్ల్యూఎస్ పరిశ్రమలు ఉన్నాయి. ఫెర్రో ఎల్లాయ్స్ పరిశ్రమలకు ప్రధాన ముడిసరకు విద్యుత్తే. సాధారణ ఫెర్రో ఎల్లాయ్స్ పరిశ్రమల్లో ఉత్పత్తి ఖర్చుల్లో 30 శాతం కరెంటుకే వెచ్చించాలి. ప్రస్తుతం యూనిట్‌కు చార్జ్ రూ.9.89 (సర్కారు డ్యూటీ, ట్రూ అప్ చార్జెస్, ఫ్యూయల్ చార్జెస్, ఎనర్జీ చార్జెస్ రూ.3.89లతోపాటు యూనిట్ చార్జ్ రూ.6 కలుపుకొని) వసూలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ట్రూ అప్ చార్జీల పేరిట భారం పెరిగింది. ఒక టన్ను ఉత్పత్తికి 4000 నుంచి 4,500 యూనిట్ల విద్యుత్ అవసరమవుతుంది. ఫెర్రో సిలికాన్ వంటి ప్రత్యేక ఉత్పత్తుల్ని తయారు చేసే పరిశ్రమల్లో టన్నుకు 8,500 నుంచి 9 వేల యూనిట్ల విద్యుత్ కావాలి. కూటమి ప్రభుత్వం విద్యుత్ భారం పెంచడం, పరిశ్రమలకు సబ్సిడీ కల్పించకపోవడంతో పరిశ్రమలు మూతపడుతున్నాయి. అందుకే పొరుగు రాష్ట్రాలు యూనిట్‌కు రూ.1.50 రాయితీ కల్పించేందుకు సిద్ధంగా ఉన్నాయి. అందుకే పారిశ్రామికవేత్తలు ఇతర రాష్ట్రాలకు వెళ్లేందుకు మొగ్గు చూపిస్తున్నారు.

ఉపాధి కోల్పోతున్న కార్మికులు

ప్రస్తుతం పరిశ్రమలు మూసేస్తున్న కారణంగా స్కిల్ ఉన్న సీనియర్ కార్మికులు ఉపాధి కోల్పోతున్నారు. పెయింటింగ్, సిమెంటు పనులు, హోటల్స్‌లో పనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. వయస్సు పైబడిన కార్మికులు మరో పరిశ్రమలో ఉపాధి లేక దిక్కుతోచని దుస్థితిలో రోడ్డున పడుతున్నారు. ప్రస్తుతం అచ్యుతాపురం సెజ్‌లో రాజరాజేశ్వరి లలితా త్రిపుర సుందరి ఫెర్రో అల్లాయిస్ ప్రైవేట్ లిమిటెడ్ కర్మాగారం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. ఇందులో సుమారు 550 ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తున్నారు. విద్యుత్ బకాయిలు పేరుకుపోవడంతో గత నెలలోనే కర్మాగారానికి విద్యుత్ సరఫరాను ఈపీడీసీఎల్ అధికారులు నిలిపివేశారు. అప్పటి నుంచి ఉత్పత్తి నిలిచిపోయింది. విద్యుత్ బకాయిలు చెల్లించి కర్మాగారంలో ఉత్పత్తిని పునఃప్రారంభిస్తామని యాజమాన్యం చెప్పింది. మరోవైపు గుట్టుచప్పుడు కాకుండా యాజమాన్యం కర్మాగారంలో కొంత ముడిసరకుతోపాటు ఉత్పత్తి చేసిన సరకును కంటైనర్లతో బయటకు పంపించేందుకు సిద్ధపడుతోంది.

మోయలేని విద్యుత్ భారం

ఒక ఫెర్రో పరిశ్రమకు సగటున నెలకు రూ.50 కోట్ల వరకు విద్యుత్ బిల్లు వస్తుంది. ఫెర్రో పరిశ్రమల యజమానుల సంఘం విజ్ఞప్తి మేరకు గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం యూనిట్‌కు రూ.7లు ఉన్న ధరను రూ.6లకు తగ్గించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ట్రూ అప్ చార్జీలు, ఇతర సుంకాల పేరిట ఒక్కో యూనిట్ కు రూ.3.89 పైసలు అదనంగా వసూలు చేస్తోంది. దీంతో యూనిట్‌కు రూ.9.89 చెల్లించాల్సి వస్తోంది. ఒక ఫెర్రో పరిశ్రమకు సాధారణంగా వచ్చే విద్యుత్ బిల్లు రూ.50 కోట్లకు అదనంగా రూ.28 కోట్లు చెల్లిస్తున్నారు. అంటే సగటున ఒక ఫెర్రో పరిశ్రమ నెలకు రూ.78 కోట్లు విద్యుత్ బిల్లు చెల్లిస్తోంది.

పరిశ్రమలను, కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి



కూటమి ప్రభుత్వం విధానాల కారణంగానే పరిశ్రమలు మూతపడుతున్నాయి. ప్రధానంగా ఫెర్రో ఎల్లాయ్స్ పరిశ్రమలు చావు దెబ్బ తిన్నాయి. చిన్న తరహా పరిశ్రమలు 30 వరకూ ప్రొడక్షన్ నిలిపివేశాయి. పరిశ్రమలకు, కార్మికులకు మద్దతుగా ప్రభుత్వం నిలవాలి. కొత్త పరిశ్రమలు తీసుకొస్తామని ఆర్భాటాలు కాకుండా ఈ ప్రభుత్వం ఉన్న పరిశ్రమలను సక్రమంగా కార్మిక చట్టాలు, హక్కులు అమలయ్యేవిధంగా చేస్తే సరిపోతుంది. యాజమాన్యాలు కూడా కార్మికుల హక్కులకు అనుగుణంగా వ్యవహరించాలి. ప్రభుత్వ అనుమతి లేకుండా పరిశ్రమలు మూసివేయకూడదు.

– గనిశెట్టి సత్యనారాయణ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు

వైఎస్సార్‌సీపీ హయాంలో పారిశ్రామిక పరుగులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అనకాపల్లి జిల్లా పారిశ్రామికంగా పరుగులు పెట్టింది. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టే నాటికి జిల్లాలో 120 భారీ పరిశ్రమలున్నాయి. 2019 నుంచి 2023 వరకూ జిల్లాలో 35 భారీ పరిశ్రమలు, 221 ఎంఎస్‌ఎంఈ పరిశ్రమలు నెలకొల్పారు. 2019లో 6 కంపెనీలు, 2020 నుంచి 2023 వరకూ రూ.15,425 కోట్లతో 28 భారీ పరిశ్రమలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా 14,114 మందికి ఉద్యోగావకాశాలు కల్పించారు. దీంతో జిల్లాలో భారీ పరిశ్రమలు 155కు, ఎంఎస్‌ఎంఈలు 11,343కు చేరుకున్నాయి. అంతేకాకుండా సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించడంలో భాగంగా అనకాపల్లి కోడూరు వద్ద భారీ ఎంఎస్‌ఎంఈ పార్కును అభివృద్ధికి చేసేందుకు భూసేకరణ ప్రక్రియ కూడా చేపట్టింది. అదేవిధంగా చోడవరం నియోజకవర్గంలో కోమళ్లపూడిలో ఎస్‌ఈజెడ్ ఏర్పాటుతో పాటు తాజాగా కొత్తగా నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కును, పూడిమడకలో హైడ్రోజన్ గ్రీన్ హబ్‌ను తీసుకురావడంలో కీలక పాత్ర పోషించింది. 2014లో గత టీడీపీ సర్కారు ఎగ్గొట్టిన రూ.962.05 కోట్ల పారిశ్రామిక ప్రోత్సాహకాలను కూడా చెల్లించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో రూ. 4483.71 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 85,785 మందికి ఉపాధి లభించింది. రూ.1,715.16 కోట్ల రాయితీలను, రూ.1,144 కోట్ల విలువైన విద్యుత్ రాయితీ ప్రోత్సాహకాలను నాటి ప్రభుత్వం పరిశ్రమలకు చెల్లించింది.

గేటు బయటే ఫెర్రో కార్మికులు



పరిశ్రమ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

- నోటీసు ఇవ్వకుండా కంపెనీ మూసిన యాజమాన్యం
- దిక్కుతోచని స్థితిలో రాజరాజేశ్వరి లలిత త్రిపురసుందరి ఫెర్రో ఎల్లాయ్స్ కార్మికులు
- మార్చి నెలాఖరుకు బకాయిలు చెల్లిస్తామన్న కంపెనీ ప్రతినిధులు
- రాతపూర్వకంగా హామీ ఇచ్చేందుకు నిరాకరణ

అచ్యుతాపురం రూరల్: ఎటువంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా.. విధులకు హాజరు కావద్దని, గేటు బయటనే ఉండిపోవాలని యాజమాన్యం ఆదేశించడంతో కార్మికులు ఖిన్నులయ్యారు. తమకు ఇన్నాళ్లు తిండి పెట్టిన తల్లిలాంటి సంస్థ ప్రాంగణంలో అడుగు పెట్టవద్దని చెప్పడంతో వారిలో ఆవేదన రగిలింది. రాజరాజేశ్వరి లలిత త్రిపురసుందరి ఫెర్రో ఎల్లాయ్స్ కార్మికులు శుక్రవారం కంపెనీకి వెళ్లే సరికి ఈ పరిస్థితి ఎదురైంది. దీంతో కార్మికులు ఒక్కసారిగా దిక్కుతోచని అయోమయ పరిస్థితిలో ఆందోళనకు గురయ్యారు. ఇవ్వాల్సిన బకాయిలు ఇవ్వకుండా, ఏవిధమైన నోటీసు లేకుండా ఉన్న పళంగా బయటకి నెట్టేయడం అన్యాయమని వారు వాపోయారు. సీఐటీయూ నాయకులు వారికి బాసటగా నిలిచారు. వెంటనే బకాయి వేతనాలు చెల్లించి పరిశ్రమను యధావిధిగా నడిపించాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. విద్యుత్ బిల్లులు కట్టలేదని జనవరి 23న విద్యుత్ శాఖ అధికారులు సరఫరా నిలిపివేశారు. అప్పటి నుంచి ఒడిదొడుకుల్లో ఉన్న పరిశ్రమను గాడికి తెస్తారని కార్మికులు ఆశగా ఎదురుచూస్తున్నారు. పరిశ్రమ ప్రతినిధి మాట్లాడుతూ 600 మెట్రిక్ టన్నుల మెటీరియల్ పరిశ్రమలోనే ఉందని, మార్చి 31 నాటికి బకాయిలు చెల్లిస్తామని చెప్పారు. ఈ విషయం రాతపూర్వకంగా తెలపాలని కార్మికులు కోరగా, పరిశ్రమ ప్రతినిధులు నిరాకరించారు. నిరాశ చెందిన కార్మికులంతా అచ్యుతాపురం పోలీస్ స్టేషన్ చేరుకుని ఎస్ఐ సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. తమను ఉన్నట్టుండి ఒక్కసారిగా పరిశ్రమ నుంచి బయటకు నెట్టేశారని, ప్రభుత్వం, లేబర్ అధికారులు చొరవ తీసుకుని కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. సోమవారం నాటికి పరిశ్రమ యాజమాన్యం సరైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో సిటు మండల కన్వీనర్ కూండ్రపు సోమునాయుడు, లలిత ఫెర్రో పరిశ్రమ కార్మికులు, మహిళా కార్మికులు పాల్గొన్నారు.



ఎస్ఐకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

చీటీల వ్యాపారి ఇంటి వద్ద బాధితుల ఆందోళన

- అంత్యక్రియలకు ఆటంకం లేకుండా పోలీసుల చర్యలు



రామారెడ్డి ఇంటి ఎదుట బాధితుల ఆందోళన

మాకవరపాలెం: మృతి చెందిన చీటీల వ్యాపారి ఇంటి వద్ద రెం డోరోజు ఆందోళన కొనసాగింది. మాకవరపాలెంలో నివాసముంటూ చీటీలు, వడ్డీ వ్యాపారం చేస్తున్న గొలుగూరి వెంకటరామారెడ్డి గురువారం మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నగదు ఇచ్చిన వారితోపాటు చీటీలు కట్టిన వారంతా శుక్రవారం ఉదయం నుంచి వ్యాపారి ఇంటి వద్ద లబోదిబోమన్నారు. తాము ఇచ్చిన నగదు, కట్టిన చీటీలకు న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు. రామారెడ్డికి ఇచ్చిన నగదు చెల్లింపులపై స్పష్టమైన హామీ ఇచ్చాకే మృత దేహాన్ని కదలనిస్తామని తేల్చిచెప్పారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు బాధితులంతా మృతుని ఇంటి బయటే ఆందోళన కొనసాగించారు. ఈ నేపథ్యంలో మృతుడి కుటుంబీకులు రామారెడ్డి ఇతరులకు ఇచ్చిన అప్పులు, బాధితుల నుంచి తీసుకున్న నగదుతోపాటు అతని ఆస్తుల వివరాలు తెలుసుకుని తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో మృతదేహాన్ని అడ్డుకునే ప్రయత్నం జరిగే అవకాశం ఉండటంతో పోలీసులు సమయస్ఫూర్తితో వ్యవహరించి అంత్యక్రియలకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకున్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వివాహిత మృతి

అనకాపల్లి: మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడిన మంగారపు జ్యోతి(29) శుక్రవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పట్టణ ఎస్‌ఐ డి.ఈశ్వరరావు వివరాల మేరకు... గవరపాలెం సాగిదుర్గరాజు వీధిలో నివసిస్తున్న మంగారపు జ్యోతి, షేక్ అబ్దుల్‌ఘని 2023లో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఏడేళ్ల బాబు ఉన్నాడు. ఈ నెల 19న భర్త అబ్దుల్‌ఘని తన అత్తవారి ఇంట్లో ఉండగా, భర్తను బయటకు తీసుకెళ్లాలని జ్యోతి కోరింది. దానికి ఆమె తల్లి కుమారి ఇప్పుడు ఎందుకు రోడ్డు మీదకని మందలించడంతో మనస్తాపం చెంది ఇంటి మేడపైకి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడగా, ఆమెను హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తిష్ట వేసిన టెస్టర్లు.. ముట్టుకుంటే షాకే..!

- రెండు, మూడు దశాబ్దాలుగా ఒకే చోట విధులు
- ఈపీడీసీఎల్‌నే శాసిస్తున్న ఎంఆర్టీ డివిజన్ టెస్టర్లు
- బదిలీ చేసిన 3 రోజుల్లోనే మళ్లీ యథాస్థానానికి..
- వారిపై చర్యలకు యత్నించిన ఏఈలకు ట్రాన్స్‌ఫర్ ఆర్డర్లు
- కార్పొరేట్ కార్యాలయంలోనూ చక్రం తిప్పుతున్న ఆ ఐదుగురు

ఈపీడీసీఎల్‌లో వారంతా సాధారణ ఉద్యోగులే. అయినప్పటికీ కార్పొరేట్ కార్యాలయాన్నే శాసిస్తున్నారు. దాదాపు మూడు దశాబ్దాలుగా ఒకే చోట పాతుకుపోయారు. వారి ఆగడాలు శృతి మించుతుండటంతో, అక్కడి నుంచి బదిలీ చేయాలని ప్రయత్నించిన అధికారులకే ట్రాన్స్‌ఫర్ ఆర్డర్లు వచ్చి చెట్టుకొకరు, పుట్టకొకరుగా ఎగిరిపోయారు. కానీ వారు మాత్రం లోకల్ అంటూ అక్కడే తిష్ట వేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత, బదిలీ చేసిన మూడు రోజుల్లోనే తిరిగి పాత గూటికి చేరుకున్నారంటే.. వారి రూటే సెప'రేటు'అని అర్థం చేసుకోవచ్చు. ఎంఆర్టీ డివిజన్‌లో టెస్టర్లుగా విధులు నిర్వహిస్తున్నా.. సీజీఎంల కంటే పవర్ ఫుల్‌గా వ్యవస్థను మేనేజ్ చేస్తున్న ఘనులు కోట్లకు పడగలెత్తారన్న ఆరోపణలు ఉన్నాయి.

– సాక్షి, విశాఖపట్నం



ఏపీ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ వ్యవస్థ కొందరు ఉద్యోగులకు మాత్రమే కొమ్ముకాస్తున్న సంస్థగా మారిపోయింది. రాజకీయ మద్దతు, ఉన్నతాధికారుల అండదండలు ఉంటే దశాబ్దాలుగా ఒకే చోట కాలు కదపకుండా పాతుకుపోవచ్చు. ఇందుకు గోపాలపట్నంలోని ఎంఆర్‌టీ డివిజన్ ఉద్యోగులే నిదర్శనం. ఆ డివిజన్‌లోని మీటర్స్ సెక్షన్‌లో ఐదుగురు ఉద్యోగులు దశాబ్దాలుగా ఈపీడీసీఎల్‌ను ఏలుతున్నారు. ఎల్‌టీ మీటర్ సెక్షన్‌లో జేఎల్‌ఎం నుంచి ఫోర్‌మన్ గ్రేడ్–2గా అక్కడే ఎదిగిన ఒక ఉద్యోగి ఏకంగా 32 ఏళ్ల పాటు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక హెచ్‌టీ సెక్షన్‌లో టెస్టర్ గ్రేడ్–1, 2 విభాగాలకు చెందిన ముగ్గురు ఉద్యోగుల్లో ఒకరు 29 ఏళ్లుగా, మరొకరు 25 ఏళ్లుగా, ఇంకొకరు 23 ఏళ్లుగా తిష్ట వేసుకుని కూర్చున్నారు. సీటీ మీటర్ సెక్షన్‌లో టెస్టర్ గ్రేడ్–1 ఉద్యోగి 21 ఏళ్లుగా ఆ విభాగాన్ని ఏలుతున్నారంటే.. ఈపీడీసీఎల్‌లో వీరి పలుకుబడి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు

బదిలీ అయినా.. మళ్లీ అక్కడికే.!

ఒక్కొక్క ఉద్యోగి 20 నుంచి 30 సంవత్సరాలకు పైగా ఒకే చోట తిష్ట వేసుకొని కూర్చోవడంతో... విధుల పట్ల వారు నిర్లక్ష్యం వహించినా ప్రశ్నించేవారు కరువయ్యారు. జూనియర్లుగా విధుల్లోకి వస్తున్న వారిపైనే విధుల భారం మొత్తం మోపుతున్నారు. వీరు చెప్పినట్టు వినకపోతే, జూనియర్లకు బదిలీ వేటు తప్పదు. అల్లూరి లేదా శ్రీకాకుళం జిల్లాలకు బదిలీ చేయించేస్తారు. తమ సెక్షన్ పరిధిలో ఎవరికైనా బదిలీ కావాలంటే, ఈ ఉద్యోగుల సిఫారసు తప్పనిసరిగా మారింది. ఈపీడీసీఎల్ ఎంఆర్టీ డివిజన్‌లో ఎవరిని ఎక్కడికి బదిలీ చేయాలో వీరి కనుసన్నల్లోనే ఉన్నతాధికారులు చేస్తుంటారని విమర్శలూ ఉన్నాయి. వీరి ఆగడాలు భరించలేక.. ఏఈలు, డీఈలు ఎవరైనా సదరు ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని కార్పొరేట్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే.. ఆ అధికారులకే ఎదురుదెబ్బ తగులుతుంది. ఫిర్యాదులు చేసిన వారందరూ గోపాలపట్నం కార్యాలయం నుంచి బదిలీ అయిపోయారే తప్ప.. వీరిని మాత్రం కదిలించలేకపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత, ఇటీవల జరిగిన బదిలీల్లో ఏడాది కాలం పనిచేసిన ఉద్యోగులను సైతం ఈపీడీసీఎల్ అధికారులు బదిలీ చేశారు. కానీ, ఈ ఉద్యోగుల జోలికి మాత్రం పోలేదు. ఈ వ్యవహారంపై కొందరు విజిలెన్స్‌కు ఫిర్యాదు చేయడంతో హడావుడిగా ఈ ఐదుగురినీ అనకాపల్లి, విజయనగరం, అల్లూరి జిల్లాలకు బదిలీ చేశారు. అయితే, కేవలం మూడు రోజుల్లోనే వీరంతా గోపాలపట్నం కార్యాలయానికి తిరిగి వచ్చేయడం గమనార్హం. గతంలో ఒకటి రెండు సార్లు బదిలీ చేసినా, నెల రోజుల్లోనే తిరిగి గోపాలపట్నంలో ప్రత్యక్షమయ్యారు.

విజి'లెన్స్'కూడా లేదు

చేసేది చిన్న ఉద్యోగమైనా వీరంతా కోట్లకు పడగలెత్తినట్లు తెలుస్తోంది. తమ సెక్షన్ పరిధిలో ఏ పనికి వచ్చినా వినియోగదారుల నుంచి లంచాలు తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎంఆర్టీ డివిజన్‌లో ఎల్‌టీ మీటర్, హెచ్‌టీ మీటర్లు, ట్రాన్స్‌ఫార్మర్ విభాగాలుంటాయి. ఎంఆర్టీ యూనియన్ రా'రాజు'గా చెలామణీ అవుతూ మూడు దశాబ్దాలుగా ఎల్‌టీ మీటర్ సెక్షన్‌లోనే పనిచేస్తున్నారు. ఎవరికైనా ఎక్కువ బిల్లు వస్తే మీటర్ టెస్టింగ్‌కు దరఖాస్తు చేసుకుంటారు. ఈ సమయంలోనే వీరంతా తమ హస్తలాఘవాన్ని ప్రదర్శిస్తారు. ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్ల సహకారంతో మీటర్‌లో తప్పుందంటూ సర్టిఫై చేసి వినియోగదారుల దగ్గర నుంచి అందినకాడికి గుంజుకుంటారు. వీరిపై పలుమార్లు ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నా.. ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని సమాచారం. వీరికి గోపాలపట్నం కార్యాలయంలోని కొందరు అధికారులతో పాటు ప్రధాన కార్యాలయంలోని ఉన్నతాధికారులు పూర్తి సహకారం అందిస్తున్నారని తెలుస్తోంది. పలుమార్లు ఎంఆర్టీ ఉద్యోగుల వ్యవహారశైలిపై ఈపీడీసీఎల్ విజిలెన్స్ అధికారులకు కూడా ఫిర్యాదులు అందినా కనీసం స్పందించలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఈపీడీసీఎల్ ప్రధాన కార్యాలయం

గంజాయి రవాణా కట్టడికి సాంకేతిక పరిజ్ఞానం

కస్టమ్స్, ఎక్సైజ్, సర్వీస్ టాక్స్ అప్పిలెట్ ట్రిబ్యునల్ అధికారి రంగధామ్



కస్టమ్స్, ఎక్సైజ్, సర్వీస్ టాక్స్ అప్పిలెట్ ట్రిబ్యునల్ అధికారి ఏ రంగధామ్‌కు బొకే అందజేస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని కస్టమ్స్, ఎక్సైజ్, సర్వీస్ టాక్స్ అప్పిలెట్ ట్రిబ్యునల్ అధికారి ఏ రంగధామ్ తెలిపారు. స్థానిక గాంధీనగరం ఎస్ఆర్ శంకరన్ హాల్లో శుక్రవారం అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పోలీస్ సిబ్బందికి మాదకద్రవ్యాల నియంత్రణకు చట్టపరమైన అంశాలు, దర్యాప్తు ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల కేసుల్లో శిక్షలు శాతం పెరిగేలా దర్యాప్తు చేయాలన్నారు. గంజాయి కేసుల దర్యాప్తులో తీసుకోవల్సిన మెలకువలు, జాగ్రత్తలను వివరించారు. ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ ఎఫ్ఐఆర్ నమోదు చేయడం నుంచి చార్జిషీట్ వేయడం వరకు అన్ని ప్రొసీజర్‌లను కచ్చితంగా పాటించాలన్నారు. ఏ ఒక్క ప్రొసీజర్‌ను పాటించకపోయినా కేసు పోతుందన్నారు. గంజాయి సీజ్ చేసినప్పుడు గెజిటెడ్ అధికారి ఆధ్వర్యంలో మధ్యవర్తుల సమక్షంలో చేయాలని సూచించారు. 161 స్టేట్‌మెంట్లు రికార్డు చేసిన తర్వాత వాటిని మధ్యవర్తులకు చదివి వినిపించాలన్నారు. గంజాయి శాంప్లింగ్ ప్రొసీజర్‌ను న్యాయమూర్తి సమక్షంలో చేయించాలని, తద్వారా నిందితులకు కోర్టులో శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అదనపు ఎస్పీ ఎల్ మోహన్‌రావు, డీఎస్పీ బి. అప్పారావు, ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, బాల సూర్యారావు పాల్గొన్నారు.

కేజీబీవీ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

డీఈవో గిడ్డి అప్పారావునాయుడుకు వినతి



డీఈవో గిడ్డి అప్పారావునాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న గొంది చినబ్బాయ్

అనకాపల్లి: కేజీబీవీ ఉపాధ్యాయినుల పనిగంటలు చాలా దయనీయమైన స్థితిలో ఉన్నాయని, రోజూ రాత్రి 9 నుంచి మరుసటి రోజు ఉదయం 11 గంటల వరకూ విధులు నిర్వహించడం మానవ హక్కుల ఉల్లంఘనేనని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ తెలిపారు. జీవీఎంసీ విలీన గ్రామమైన కొప్పాక డీఈవో కార్యాలయంలో డీఈవో గిడ్డి అప్పారావునాయుడుకు యూటీఎఫ్, కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. చినబ్బాయ్ మాట్లాడుతూ నైట్ డ్యూటీలో ఇద్దరు ఉపాధ్యాయినులకు గాను ముగ్గురిని పెంచాలని, వారానికి రెండు డ్యూటీలు 28 గంటల పాటు చేయడంతో తీవ్ర పని ఒత్తిడికి, ఇతర సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. కేజీబీవీలో వార్డెన్ పోస్టులు మంజూరు చేయాలని, గతేడాది సమ్మె కాలానికి సంబంధించి జిల్లాలో 14 మంది సిబ్బందికి 10 రోజులు జీతాలు రాలేదన్నారు. చంద్రబాబు ఎన్నికల హామీ నిలబెట్టుకోవాలని, నాన్ టీచింగ్ ఉద్యోగులకు వారంతపు సెలవులు మంజూరు చేయాలని కోరారు. స్కూల్‌ల్లో విద్యార్థినుల సంఖ్య 200 నుంచి 280కి పెరగడంతో మరో ఇద్దరు వంట కుక్‌లను పెంచాలని, పబ్లిక్ హాలిడేస్‌లో స్పెషల్ స్టడీ క్లాసులకు హాజరవుతున్న ఉపాధ్యాయినులకు సీసీఎల్ మంజూరు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు రొంగలి అక్కునాయుడు, కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ జిల్లా జేఏసీ నాయకులు వి.వి.శ్రీనివాసరావు, కరణం జ్యోతి పాల్గొన్నారు.

చెరకు దిగుబడి పెంపునకు కృషి

అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ ముకుందరావు



కొండెంపూడిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఆర్ ముకుందరావు

బుచ్చెయ్యపేట: చెరకులో అధిక పంట దిగుబడులు, ఉత్పత్తి పెంపునకు రైతులు ముందుకు రావాలని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ ముకుందరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో 8వ శాస్త్రీయ సలహా మండలి సమావేశం జరిగింది. రైతులు, శాస్త్రవేత్తలతో ఆయన పంట దిగుబడులు, అధిక ఉత్పత్తులపై సమీక్షించారు. గతంలో విస్తారంగా సాగు చేసే చెరకు ఇటీవల కాలంలో తగ్గడంపై రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేవీకే శాస్త్రవేత్తలు ఒంటి కన్ను చెరకు ముచ్చులు తయారీ చేసి రైతులకు అందిస్తారన్నారు. శాస్త్రవేత్తల పరిశోధనలు రైతాంగానికి మేలు చేకూర్చేలా ఉండాలని ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం సహ విస్తరణ సంచాలకురాలు విశాలాక్షి తెలిపారు. నర్సరీలు నుంచి మేలు రకం మొక్కలను రైతులకు అందేలా చూడాలని, దీనివల్ల అధిక పంట ఉత్పత్తి సాధిస్తారని జిల్లా ఉద్యానశాఖ అధికారి ప్రభాకరరావు తెలిపారు. గతేడాదిలో కేవీకేలో చేసిన ఫలితాలు, వచ్చే ఏడాదిలో చేపట్టే ప్రణాళికను రైతులకు శాస్త్రవేత్తలు సత్తిబాబు, గౌరికుమారి, సౌజన్య, కిశోర్, బాబు వివరించారు.

కార్మికులకు ఈ–శ్రమ్ నమోదు తప్పనిసరి

జెడ్పీ సీఈవో నారాయణమూర్తి

మాడుగుల: కార్మికులు తప్పనిసరిగా ఈ–శ్రమ్ కార్డులు తీసుకోవాలని జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ–శ్రమ్ కార్డుల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్డుల వలన బీమాతో పాటు ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. లేబర్ ఆఫీసర్‌ను పిలిపించి కార్మికులతో సమావేశం ఏర్పాటు చేసి ఈ–శ్రమ్ కార్డులు వినియోగాలపై అవగాహన కల్పించాలని ఎంపీడీవో కొంకి అప్పారావు ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూ కుంభకోణ నివేదికను బయటపెట్టండి

- బురదజల్లడం కాదు ఆరోపణలు నిరూపించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే..
- గ్రూప్–2 అభ్యర్థులు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి
- కూటమి ప్రభుత్వం తొలిసంతకం చేసిన మెగా డీఎస్సీపై స్పష్టతే లేదు
- మీడియాతో శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ



మాట్లాడుతున్న శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, చిత్రంలో అమర్‌నాథ్, ధర్మశ్రీ

సాక్షి, విశాఖపట్నం: విశాఖలో భూ కుంభకోణాలకు సంబంధించి జరిపిన విచారణ నివేదికను బహిర్గతం చేయాలని ఏపీ శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఊరికే బురదజల్లడం కాదు.. ఆరోపణలను నిరూపించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని.. ఇదే వేదికపై నుంచి అనేక సార్లు ఈ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినట్లు గుర్తు చేశారు. ఈ ప్రభుత్వానికి నచ్చినట్లే 2004 లేదా 2014 ఏ సంవత్సరం నుంచి అయినా విచారణ జరిపిన నివేదికను బయటపెట్టాలన్నారు. శుక్రవారం లాసన్స్‌బేకాలనీలోని తన క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. గుంటూరు మిర్చియార్డ్‌లో గిట్టుబాటు ధర లేక, దళారీ విధానంతో ఇబ్బందుల పడుతున్న రైతులను పరామర్శించడానికి మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెళితే చట్ట వ్యతిరేక కార్యక్రమంటూ కేసులు నమోదు చేయడం దారుణమన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉండగానే చంద్రబాబు విజయవాడలో మ్యూజికల్‌నైట్‌లో పాల్గొన్నారని, కోడ్ ఉన్నప్పుడే యూనివర్సిటీలకు వీసీ నియామకాలు చేపట్టారని గుర్తు చేశారు. ఢిల్లీలో బీజేపీ ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారానికి వెళ్లిన చంద్రబాబు, మిర్చి రైతుల సమస్యలపై కేంద్ర మంత్రితో మాట్లాడేందుకు వెళ్లినట్లు అబద్దాలు చెప్పడం ఆయనకే చెల్లిందన్నారు. ఢిల్లీలో కేంద్రమంత్రి లేరన్న విషయం ముందుగానే తెలియదా? అని ప్రశ్నించారు. చంద్రబాబు ఎప్పుడూ వ్యవసాయం, రైతుల గురించి ఆలోచించిన దాఖలాల్లేవన్నారు.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమా..?

గ్రూప్–2 మెయిన్స్ రోస్టర్ పాయింట్ సమస్యలపై అభ్యంతరాలను సహేతుకంగా పరిష్కరించాలని కోరారు. నోటిఫికేషన్ ఇచ్చిన గత ప్రభుత్వంపై నెట్టేయకుండా నిరుద్యోగుల భవిష్యత్తుపై దృష్టిసారించాలని హితవు పలికారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎం చంద్రబాబు తొలి సంతకం చేసిన డీఎస్సీ పరిస్థితే వాయిదాలు పడుతుంటే.. కూటమి పార్టీలు ఇచ్చిన హామీల పరిస్థితి ఎలా ఉంటుందో ప్రజలకు అర్థమవుతోందన్నారు.

శాస్త్రోక్తంగా శివుడి విగ్రహ పునఃప్రతిష్ట



పరమశివుని విగ్రహానికి ప్రాణ ప్రతిష్ట చేస్తున్న సచ్చిదానంద సరస్వతీ స్వామి

యలమంచిలి రూరల్: కొత్తపేట పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శిలా విగ్రహాల పునఃప్రతిష్ట క్రతువు శాస్త్రోక్తంగా జరిగింది. తాండవకాశీ తపోవనం మఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి చేతుల మీదుగా శివపార్వతులు, ఇతర దేవతామూర్తుల శిలా విగ్రహాలకు ప్రాణప్రతిష్ట జరిగింది. అనంతరం భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం శివ పార్వతుల కల్యాణం కనుల పండువగా జరిగింది. ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్, ఆలయ పునర్నిర్మాణ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

'ఏటికొప్పాక' కళాకారులకు ఊతం

- ఉపాధి పథకం ద్వారా 25 వేల అంకుడు మొక్కల పెంపకం
- డ్వామా పీడీ పూర్ణిమాదేవి వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ పూర్ణిమాదేవి

నక్కపల్లి: ఏటికొప్పాక లక్కబొమ్మల తయారీని ప్రోత్సహించేందుకు అంకుడు మొక్కల పెంపకం చేపట్టాలని నిర్ణయించినట్టు డ్వామా పీడీ పూర్ణిమాదేవి తెలిపారు. శుక్రవారం నక్కపల్లి ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో యలమంచిలి క్లస్టర్ మండలాలకు చెందిన సిబ్బందితో సమీక్షించారు. అంకుడు కర్ర కొరతను అధిగమించేందుకు యలమంచిలి, నర్సీపట్నం, పాయకరావుపేట నియోజకవర్గాల పరిధిలో 25 వేల అంకుడు మొక్కలను ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా పెంచడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. వీటిని నాటేందుకు అవసరమైన ప్రభుత్వ భూములను గుర్తించాలని ఆదేశాలు వచ్చాయన్నారు. ఉపాధి పనులకు హాజరయ్యే వేతనదారులకు రోజుకు రూ.300 చొప్పున చెల్లించాలని ప్రభుత్వం సూచించిందన్నారు. ప్రతి గ్రామంలో 50 ఇంకుడు గుంతలు నిర్మించాలని సూచించారు. సమావేశంలో క్లస్టర్ ఏపీడీ యరకయ్య, ఏపీవోలు భాగ్యలత, నానిబాబు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఈసీలు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ.315 కోట్ల ఖర్చు

గత ఏడాది ఉపాధి హామీ పథకం ద్వారా వివిధ పనుల కోసం రూ.315 కోట్లు ఖర్చు చేసినట్లు పీడీ పూర్ణిమాదేవి వెల్లడించారు. శుక్రవారం ఆమె నక్కపల్లిలో మాట్లాడుతూ గత ఏడాది రూ.1.20 కోట్ల పనిదినాలకుగాను 1.09 కోట్ల పనిదినాలు పూర్తయ్యాయన్నారు. ఈ పథకం ద్వారా వ్యవసాయ, ఉద్యానవన, సాగునీటి వసతులు, రైతులకు ఉపయోగపడే అన్ని రకాల పనులు చేపట్టడం జరిగిందన్నారు. వీటితోపాటు రూ.167 కోట్ల వ్యయంతో 1657 పనులు చేపట్టడం జరిగిందని, వీటిలో 1544 సీసీ రోడ్లు, 26 తారు రోడ్లు ఉన్నాయన్నారు. 742 గోకులం షెడ్లకు గాను 538 పూర్తయ్యాయన్నారు. వచ్చే ఏడాది కోటి 28 లక్షల పనిదినాలు లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందన్నారు. ప్రతి పంచాయతీలో అమృత సరోవర్ చెరువు, 2 ఫిష్ పాండ్స్, 25 ఫారం పాండ్స్ నిర్మించాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. జిల్లాలో 20 ఎకరాలకు ట్రెంచ్‌లు తవ్వించడం జరుగుతుందన్నారు. ప్రతి పంచాయతీలో 5 గోకులం షెడ్లు నిర్మించాలని భావిస్తున్నామన్నారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి క్రీడా పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న యువ కేంద్రం డీడీ ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్



వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

నర్సీపట్నం: కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్రం విశాఖపట్నం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక అల్లూరి సీతారామరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు ప్రారంభించారు. క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు ఈ పోటీలు దోహదపడతాయన్నారు. క్రీడలతో మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ జి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ విద్యతో పాటు యువతీ యువకులు క్రీడల్లో రాణించాలన్నారు. ప్రతి దేశం క్రీడలకు ప్రాధాన్యం ఇస్తున్నాయన్నారు. దేశ ప్రతిష్టతకు చిహ్నంగా ప్రపంచ దేశాలు క్రీడలను ప్రోత్సహిస్తున్నాయన్నారు. యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. అంతర్జాతీయ స్థాయిలో దేశానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. క్రీడాకారులకు ప్రభుత్వం ఉద్యోగంతో పాటు అవార్డులు, రివార్డులు ఇస్తుందన్నారు. అనంతరం నిర్వహించిన వాలీబాల్, షటిల్, రన్నింగ్, షార్ట్‌పుట్, బాక్సింగ్ తదితర క్రీడా పోటీల్లో యువతీ యువకులు పోటీ పడ్డారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్జీవో ఆర్గనైజింగ్ సెక్రటరీ బొొంం శివ, లిఫ్ట్ రూరల్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ సెక్రటరీ సిహెచ్. ప్రసాద్, వ్యాపారవేత్త వెలగా నారాయణరావు, ఎం.అప్పలరాజు, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ, పీఈటీ రెడ్డి శ్రీను, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కోచ్ కె.అబ్బు, బాక్సింగ్ కోచ్ శేఖర్, జి.శ్రీనుబాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిరుపయోగంగా సంచార వాహనం



ఎన్టీఆర్ ఆస్పత్రి సమీపంలో నిరుపయోగంగా ఉన్న సంచార వాహనం

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి ఆవరణలో ఎయిడ్స్ రోగులకు సంబంధించిన సంచార వాహనం ఆరుమాసాలుగా నిరుపయోగంగా ఉంది. వాహనాన్ని పట్టించుకునే సంబంధిత వైద్యశాఖ అధికారి లేకపోవడంతో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ పాడైపోతోంది. గతంలో వాహనం ద్వారా గ్రామాల్లో రోగులకు మందులు సరఫరా చేయడంతో పాటు రక్త పరీక్షలు చేసేవారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాహనానికి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

గౌరీపరమేశ్వరుల ఊంజల్ సేవ



గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఊంజల్ సేవ చేస్తున్న అర్చకులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీపంచాయత దేవాలయంలో గౌరీపరమేశ్వరుల 201వ ఊంజల్ సేవ కార్యక్రమాన్ని ఆలయ ప్రధానార్చకులు అంపోలు గోపాలకృష్ణశర్మ, పొందూరు సూర్యనారాయణశాస్త్రి, శేషు, సాయి నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమాన్ని మళ్ల అప్పారావు, రవిరాజు, అరుణ, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, గౌరీగీత మహిళా మండలి ప్రతినిధి పెతకంశెట్టి సుజాత, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సమావేశం

అనకాపల్లి: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక స్థానిక గవరపాలెం నిదానందొడ్డి విద్యుత్ శాఖ కార్యాలయంలో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ నిర్వహించనున్నట్లు ఆ శాఖ ఈఈ కె.రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా శాఖ చైర్మన్(విశ్రాంతి న్యాయమూర్తి) బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యురాలు బి.సురేఖరాణి, ఆర్థిక సభ్యుడు షేక్ బాబర్ హాజరు కానున్నట్టు పేర్కొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 6,284 దిమ్మలు వచ్చాయి..

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,600	4,760
మొదటి రకం	3,500	4,370
రెండో రకం	3,150	3,740
మూడోరకం	2,810	3,130

అనకాపల్లి సినిమాలు

రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ :రాజా
ఆరెంజ్ : సత్యనారాయణస్క్రీన్-1(ఉదయం)
పుష్ప-2 : సత్యనారాయణస్క్రీన్-1(మ్యాట్నీ, 1,2 షోలు)
జాబిలమ్మ నీకు అంత కోపమా : సత్యనారాయణ స్క్రీన్-2
తండేల్ :పర్తిసాయి
సంక్రాంతికి వస్తున్నాం :షిర్డీసాయి
సూర్య కృష్ణన్ :వెంకటేశ్వర(ఉదయం)
తల :వెంకటేశ్వర(మ్యాట్నీ, 1, 2 షోలు)
సై :శ్రీసత్య
రామం రాఘవం :రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 67 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6 యూనిట్లు, బీ పాజిటివ్-23 యూనిట్లు, ఓ పాజిటివ్-36 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్‌ను 97036 19706 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 343 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 321 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని ఫోన్ నంబర్ 08924-223595లో సంప్రదించవచ్చు.

స్వచ్ఛత ఎక్కడ?



వినాయక మందిరం వద్ద దర్శనమిస్తున్న చెత్తకుప్ప





రోడ్డు మీదుగా పారుతున్న మురుగునీరు

- పల్లెల్లో పేరుకుపోయిన చెత్త
- స్వచ్ఛత హీ సేవ.. ప్రచార ఆర్భాటమేనా?

తుమ్మపాల: పల్లెల్లో రోజురోజుకూ పారిశుధ్యం క్షీణిస్తోంది. ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోంది. పారిశుధ్య కార్మికులు ఇంటింటికీ వెళ్లి సేకరించిన చెత్తను వీధి చివరన పడేసి చేతులు దులుపుకోవడంతో పరిస్థితి షరామామూలుగా తయారవుతోంది. గాలికి ఆ చెత్తంతా మళ్లీ వీధుల్లో చెల్లాచెదురుగా దర్శనమిస్తోంది. మరోవైపు అధ్వాన డ్రైనేజీ వ్యవస్థ కారణంగా మురుగునీరు ఎక్కడికెక్కడ నిలిచిపోతోంది. గత వైఎస్సార్‌సీపీ హయాంలో స్వచ్ఛతకు మారుపేరుగా ఉండే **పల్లెలు ఇప్పుడు** మురుగు కూపాలుగా, **దోమలకు ఆవా**సాలుగా మారిపోయాయి.

ఫొటోలకు ఫోజులతో సరి.!

కూటమి ప్రభుత్వం ఎన్నికల **సమ**యంలో ఇచ్చిన హామీ**లైన** సూపర్ సిక్స్ పథకాల అమ**లు** నుంచి ప్రజల దృష్టిని మ**ర**ల్చేందుకు గత ఎనిమిది నె**ల**లుగా అనేక ప్రయత్నా**లు** చేస్తోంది. భవిష్యత్ వి**జన్** పేరుతో ప్రణాళికలకే పరి**మిత**మైన కార్యక్రమాలను పెద్ద **ఎత్తున** ప్రచారం చేస్తూ సంక్షేమ **పథకాలకు** తూట్లు పొడుస్తోంది. ఈ క్ర**మంలోనే స్వచ్ఛత** హీ సేవ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. ప్రచారానికి ఈ కార్యక్రమం బాగుండడంతో ప్రతి శనివారం కొనసాగిస్తూ అధికారులతో పరిసరాల పరిశుభ్రతకు శ్రీకారం చుట్టారు. దీంతో అధికారులు, ప్రజాప్రతినిధులు పేరుకే కార్యక్రమాలు చేపట్టి ఫొటోలకు ఫోజులిస్తూ ఎక్కడ చెత్త అక్కడే వదిలేస్తున్నారు. గత రెండు నెలలుగా కార్యక్రమాలు చేపట్టినా చెత్త మాత్రం పల్లెల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

- మండలంలో అనేక గ్రామాల్లో రోడ్లపైనే చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. మేజర్ పంచాయతీ తుమ్మపాలలో ఇటీవల కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్య**టించి అధ్వానంగా ఉన్న** మురుగు పరివారాలను పరిశుభ్రం చేయాలని చేసిన ఆదేశాలను సైతం పంచాయతీ పాలకులు కనీసం పట్టించుకోలేదు. దీంతో పాటు కొత్తూరు, శంకరం, రేబాక గ్రామాల్లో కూడా ఆమె పర్యటించారు. అక్కడ కూడా మార్పు ఏ మాత్రం లేకపోవడంతో ఈ కార్యక్రమం ప్రచార ఆర్భాటమే అంటూ ఆయా గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు. పలు గ్రామాల్లో దళిత వాడలు మరింత అధ్వానంగా మారాయి. కనీసం దళిత వాడలను పట్టించుకునే నాథుడే లేకపోవడంతో మరింత దుర్భరంగా మారుతున్నాయి. చెత్త చెదారంతో పాటు రోడ్లకు ఇరువైపులా తుప్పలు పెరిగిపోయాయి. పల్లెల్లో ప్రధాన కూడళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్లు, కాలువలు మురుగుతో నిండిపోయాయి.



రేబాక ఎస్సీ కాలనీలో రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన ముళ్ల కంచె

ఎక్కడ చెత్త అక్కడే ఉంటోంది..



గ్రామాల్లో చెత్తా చెదారం పేరుకుపోయింది. గతంలో కన్నా ఇటీవల మరింత దారుణంగా చెత్త దర్శనమిస్తోంది. పారిశుధ్య కార్మికులు చెత్తను తీసుకెళ్లి వీధి చివరన పడేయడంతో ఫలితం ఉండడం లేదు. మరోవైపు గ్రామాల్లో విచ్చలవిడి మద్యం విక్రయాలతో మందుబాబులు గుడి, బడులను కూడా వదలడం లేదు. మద్యం సేవించి ఖాళీ బాటిళ్లను ఎక్కడికక్కడ వదిలి వెళ్లడంతో పరిసరాలు మరింత అధ్వానంగా తయారవుతున్నాయి. అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలి.

– జి.రాము, శంకరం గ్రామం

దళితవాడలను నిర్లక్ష్యం చేస్తున్నారు..



స్వచ్ఛత, పరిశుభ్రత పేరుతో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రచారాలకు తప్ప క్షేత్ర స్థాయిలో చేయడం లేదు. పల్లెల్లో దళితవాడలు మరింత దుర్భరంగా తయారయ్యాయి. మండలంలో పలు గ్రామాల్లో దళిత వాడలు శివారున ఉండడంతో పారిశుధ్యంపై పాలకులు గానీ, అధికారులు గానీ చొరవ చూపడం లేదు. కనీసం మౌలిక సౌకర్యాలు కూడా కల్పించడం లేదు. దోమల వృద్ధితో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. రోగం వచ్చాక మందులు పంపిణీ చేసే బదులు ముందుగానే పరిసరాలను పరిశుభ్రం చేసి రోగాల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి.

– రేబాక మధుబాబు, అనకాపల్లి

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



జానకీరామరాజును సత్కరిస్తున్న వైద్యుడు జి.రామమూర్తి

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీలో కష్టపడి పనిచేసిన వ్యక్తులకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తింపు ఇస్తారని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, ఎన్టీఆర్ ఆస్పత్రి మాజీ చైర్మన్, వైద్యుడు జి.రామమూర్తి అన్నారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడిగా మందపాటి జానకీరామరాజును మరోసారి నియమించడంతో ఆయనను రామమూర్తి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు మాట్లాడుతూ పట్టణ పరిధిలో పార్టీ శ్రేణులతో త్వరలో సమావేశం నిర్వహించి, పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు-1 ఉగ్గిన అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

కశింకోట పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు

కశింకోట: కశింకోటలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 27న జరగనున్న ఎన్నికలో 83 మంది ఈ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకుంటారని పేర్కొన్నారు. మండలం నుంచి ఉపాధ్యాయ ఓటర్లు వచ్చి ఇక్కడ ఓటు వేయనున్నారన్నారు.

భక్తిశ్రద్ధలతో భజన

కశింకోట: కశింకోటలోని గవరపేటలో కొలువైన దుర్గమాంబ ఆలయంలో శుక్రవారం రాత్రి మహిళలు భజన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాదేవి, ఇతర దేవతా మూర్తులను ఆరాధిస్తూ భక్తి పాటలు పాడి భజన చేశారు.

అధ్వానంగా బస్ స్టేషన్ రోడ్డు



బస్ స్టేషన్‌లో అధ్వానంగా ఉన్న రోడ్డు

కశింకోట: కశింకోటలోని ఆర్టీసీ బస్ స్టేషన్ రోడ్డు అధ్వానంగా ఉంది. రాకపోకలకు ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. రోడ్డు రాళ్లు తేలి ఉండడంతో బస్సులు వచ్చే సమయంలో ధూళి ఎగసి పడుతోంది. చిన్నపాటి వర్షం పడినా బురదమయంగా మారి అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రయాణికులు బస్ స్టేషన్‌లోకి రావడానికి నానా అవస్థలు పడుతున్నారు. ఒక్కొక్కసారి బస్సులు కూడా స్టేషన్‌లోకి రాకుండా జాతీయ రహదారి మీదుగా నేరుగా వెళ్లిపోతున్నాయని ప్రయాణికులు చెబుతున్నారు. ఏడాది క్రితం గత ప్రభుత్వ హయాంలో బస్ స్టేషన్ ప్రాంతాన్ని రాళ్లు, మెటలు వేసి వెడల్పు చేసి ఎత్తు చేశారు. దీనిపై పక్కాగా తారు రోడ్డు వేయడానికి ప్రయత్నాలు చేస్తుండగా.. సార్వత్రిక ఎన్నికలు రావడంతో పనులు ముందుకు సాగలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దీని గురించి పట్టించుకోలేదని, దీంతో తమకు ఇబ్బందులు తప్పడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్టేషన్ రోడ్డును అభివృద్ధి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం



తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అసోసియేషన్ సభ్యులు

అనకాపల్లి టౌన్: తెలుగు భాష ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సిద్దార్థ సోషల్ సర్వీస్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం అన్నారు. స్థానిక వన్‌వే ట్రాఫిక్ జంక్షన్‌లోని తెలుగుతల్లి విగ్రహం వద్ద అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా గవరపాలెం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా తెలుగు భాష నాలుగో స్థానంలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వినకోట నీలేష్ గుప్తా, పట్నాల కృష్ణమోహన్, సహాయ కార్యదర్శి రొబ్బి మల్లేశ్వరావు, కొత్తూరి రామారావు నందేల అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు గౌరీపరమేశ్వరుల ఉత్సవం



వెలంపేట గౌరీపరమేశ్వరుల విగ్రహం



కశింకోట ప్రధాన రహదారిలో ఆకర్షణీయంగా విద్యుద్దీపాలంకరణ

కశింకోట: కశింకోటలోని వెలంపేట గౌరీపరమేశ్వరుల(గౌరమ్మ) ఉత్సవాన్ని శనివారం పెద్ద ఎత్తున నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. ఏటా ఫిబ్రవరి నెలలో ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఉదయం నుంచి గౌరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం అమ్మవారి ఊరేగింపు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ చేపడతామన్నారు. ఉత్సవంలో భాగంగా స్థానిక ప్రధాన రహదారిలో విద్యుద్దీపాలంకరణ కనువిందు చేస్తోంది.

చెత్త సంపద కేంద్రాలతో బహుళ ప్రయోజనాలు



దేవరాపల్లి నాలుగు రోడ్ల కూడలిలో ప్రతిజ్ఞ చేస్తున్న క్లాప్ మిత్రలు, పంచాయతీ సెక్రటరీలు

దేవరాపల్లి: చెత్త సంపత తయారీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా పంచాయతీకి ఆదాయంతో పాటు గ్రామ ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని ఎంపీడీవో ఎం.వి. సువర్ణరాజు తెలిపారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్వహణపై మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమం దేవరాపల్లిలో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలు హాజరయ్యారు. చెత్త సంపద కేంద్రంతో కలిగే ప్రయోజనంపై అవగాహన ర్యాలీ నిర్వహించి, నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడి స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ సాధనకు కృషి చేద్దామని ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీవో సువర్ణరాజు మాట్లాడుతూ ప్రతి ఇంటిలో వ్యర్థాలను తడి, పొడి చెత్తగా వేరు చేసి వీధుల్లోకి వచ్చే క్లాప్ మిత్రలు(హరిత రాయబారులు)కు అందజేయాలని ప్రజలకు సూచించారు. తద్వారా ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారన్నారు.

యూనియన్ బ్యాంకు ఉద్యోగుల ఆందోళన




అనకాపల్లి యూనియన్ బ్యాంకు ముందు నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

అనకాపల్లి: స్థానిక మెయిన్ రోడ్డులో ఉన్న యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. బ్యాంకులో నియామకాలు చేపట్టాలని, తాత్కాలిక ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, వారానికి ఐదు రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ నియామకాలు ఆపాలన్నారు. యూనియన్ బ్యాంకు రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాండ్రేగుల హరికృష్ణ మాట్లాడుతూ వచ్చే నెల 24, 25 తేదీల్లో జరిగే బ్యాంకు ఉద్యోగుల రెండు రోజుల దేశ వ్యాప్త ఆందోళనను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ రమేష్, సిబ్బంది శ్రీదేవి, శిరీష, రోజా, ఎ.వి.జె.రాజు, ఆడారి రాము, మాలతి, తదితరులు పాల్గొన్నారు.

1962 సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలని వినతి

తుమ్మపాల: ప్రభుత్వ ప్రయోజనాలే లక్ష్యంగా పశు సంవర్ధక శాఖలో మూడేళ్లుగా సేవలందిస్తున్న తమను అకారణంగా విధుల్లోంచి తొలగించడం తీవ్ర అన్యాయమని 1962 పశుసంచార వాహన సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ విజయ కృష్ణన్‌ను కలిసి తమ గోడును విన్నవించుకున్నారు. 2022 నుంచి పశుసంవర్ధక శాఖలో 1962 సంచార వాహనం ద్వారా సేవలందించేందుకు నియోజకవర్గానికి రెండు వాహనాల చొప్పున కేటాయిస్తూ రైతులకు సేవలందించేందుకు తమను నియమించారని, అరకొర జీతాలతో కష్టాలు పడుతున్నామని వారు విన్నవించారు. వాహనాల మరమ్మతుల బిల్లులు చెల్లిస్తూ అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తున్న తమకు కనీస ముందస్తు సమాచారం కూడా లేకుండా విధుల్లోంచి తొలగిస్తున్నట్లు నోటీసులు పంపించారని, వాటిని తక్షణమే ప్రభుత్వం వెనక్కు తీసుకుని 1962 సేవలు కొనసాగించి తమకు జీవనాధారం కల్పించాలని కోరారు.

భూఆధార్ నమోదులో సర్వర్ కష్టాలు



కొరుప్రోలు రైతు భరోసా కేంద్రంలో భూఆధార్ నమోదు చేస్తున్న సిబ్బంది

ఎస్.రాయవరం: గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో తలపెట్టిన భూఆధార్ నమోదు ప్రక్రియకు సర్వర్ మొరాయింపుతో రైతులు పడిగాపులు కాస్తున్నారు. ఈ నెల 25వ తేదీతో గడువు ముగియనుందని సిబ్బంది ప్రచారం చేయడంతో రైతులు పదేపదే రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి నిరాశతో వెనుదిరుగుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. సిబ్బంది అందుబాటులో ఉంటూ నమోదు ప్రక్రియ ప్రారంభిస్తున్నప్పటికీ సర్వర్ మొరాయింపుతో గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. సర్వర్ సక్రమంగా పని చేసే వరకు గడువు పెంచాలని రైతులు కోరుతున్నారు. భూఆధార్ నమోదు కాకుంటే ప్రభుత్వం ఇచ్చే రాయితీలు రావన్న ఆందోళనలో రైతులు ఉన్నారు.

మామిడివాక గెడ్డా? డంపింగ్ యార్డా?



మామిడివాక గెడ్డలో పేరుకుపోయిన చెత్తను పరిశీలిస్తున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో ఉన్న మామిడివాక గెడ్డను డంపింగ్ యార్డుగా మార్చడం శోచనీయమని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు విమర్శించారు. తాళ్లపాలెంలో మామిడివాక గెడ్డ ప్రాంతాన్ని, అక్కడ పంచాయతీ సిబ్బంది వేస్తున్న చెత్తను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలోని చెత్త, ఆస్పత్రుల్లో వినియోగించే వ్యర్థాలను మామిడివాక గెడ్డలో పడి వేస్తున్నారన్నారు. దీంతో గెడ్డ నీరు కలుషితం అవుతుందని, ఆ నీటిని పశువులు సేవించి అనారోగ్యానికి గురై మరణిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భ జలాలు కూడా కలుషితమై పరిసర ప్రాంతాల్లోని నీటిని జనం తాగలేకపోతున్నారని చెప్పారు. అధికారులు స్పందించి మామిడివాక గెడ్డలో చెత్తను తొలగించి కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే కశింకోట పంచాయతీ పరిధిలోని చెత్తను తీసుకెళ్లి శారదానది వద్ద పడేస్తున్నారని చెప్పారు. దీని వల్ల నదిలో నీరు కలుషితం అవుతోందన్నారు. స్వచ్ఛ భారత్-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ప్రచారానికే పరిమితం అవుతుందని, ప్రజలకు ఉపయోగపడటం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.ఎస్.సన్యాసిరావు, వియ్యపు రాజు, బి.బాబ్జి, నాగ అప్పారావు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

కండక్టర్ నారాయణను విధుల్లోకి తీసుకోవాలి



రెండో రోజు డిపో గేటు వద్ద నిరసన తెలుపుతున్న అసోసియేషన్ నాయకులు

అనకాపల్లి: ఆర్టీసీ ఉద్యోగులపై ఆ శాఖ అధికారులు వేధింపులు ఆపాలని, అనకాపల్లి డిపోలో విధులు నిర్వహిస్తున్న కండక్టర్ ఎస్.ఎస్.నారాయణను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండో రోజు శుక్రవారం కూడా మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ డిపో అధ్యక్షుడు కె.ఎం.రావు మాట్లాడుతూ ఆర్టీసీలో డ్రైవర్లు, కండక్టర్లపై ఉన్నత స్థాయి అధికారులు వేధింపులు ఎక్కువగా ఉన్నాయని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా డ్యూటీ వేస్తున్నారని ఆరోపించారు. సస్పెండ్ చేసిన కండక్టర్‌ను తక్షణమే విధుల్లోకి తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రీజనల్ అధ్యక్షుడు ఆర్.ఎన్.రాజు, డిపో ప్రచార కార్యదర్శి ఎస్.వి.ఎస్.నారాయణ, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

చింతలపాలెం దర్గాలో చందనోత్సవం నేడు



చింతలపాలెంలో వెలసి ఉన్న హజరత్ కాలేశావలి బాబా దర్గా

కశింకోట: చింతలపాలెంలో హజరత్ కాలేశావలి బాబా దర్గా ఉరుసు షరీఫ్(చందనోత్సవం) శనివారం జరగనుంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ముస్లింలతో పాటు స్థానిక హిందువులు కూడా ఈ ఉత్సవంలో పాల్గొని మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తారు. ఈ సందర్భంగా చింతలపాలెంతో పాటు నరసింగబిల్లి, జెట్టపురెడ్డితుని గ్రామాల్లో చందనాన్ని సంప్రదాయంగా సాయంత్రం ఊరేగించి బాబా సమాధికి పూయనున్నట్లు దర్గా కమిటీ అధ్యక్షుడు సయ్యద్ గౌస్ అహ్మద్ తెలిపారు. రాత్రి దర్గా వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.